యోగం

"మనవాడిది గొప్ప యోగం అని చెప్పాడు శాస్త్రులుగారు" అన్నది వసంత, శ్రీరాంతో.

"ఆ యోగం కోసం ఒక యజ్ఞం చేయాలనీ, ఒక ఆవునో, ఏనుగునో తనకు దానం చేయాలనీ అనలేదా?" నవ్వుతూ అన్నాడు శ్రీరాం.

"నీకు బొత్తిగా భయమూ, భక్తీ లేవురా - పెద్దవాడిని నువ్వే అలా మాట్లాడితే నీ చెల్లెలూ, తమ్ముళ్ళూ కూడా నీలాగే తయారవుతారు", అన్నది జానకమ్మ.

"అన్నయ్య సెలవులకు వచ్చింది నువ్వు పెట్టే చివాట్లు తినటానికి కాదమ్మా, సరదాగా గడపటానికి" అన్నది వసంత.

"తెలుసులేవే - మొన్నేం జరిగిందో తెలుసా నాయనా..." జానకమ్మ చెప్ప బోయింది.

'నే చెబుతానుండవే అమ్మా - మరే అన్నయ్యా - మొన్న రాజాకి పెద్ద గండం తప్పింది' ఆనాడు జరిగినదంతా గుర్తుకువచ్చిందేమో, వసంత ముఖంలో భయం స్పష్టంగా కనపడింది.

మూడేళ్ళ రాజాను ఒడిలోకి తీసుకుంటూ, "ఏం జరిగిందో త్వరగా చెప్పవే - నన్ను చంపక" అన్నాడు శ్రీరాం.

"మొన్న మధ్యాహ్నం నాన్నేమో పొలానికి వెళ్ళాడు. అమ్మేమో అన్నాలు తిన్న తర్వాత మధ్య గదిలో నడుం వాల్చింది. నేనూ, రాధా ముందుగదిలో కారమ్స్ ఆడుకుంటున్నాం. మధ్యాహ్నం రెండు గంటలయింది అనుకుంటాను టైమ్. రాధ మంచినీళ్ళు కావాలంటే లోపలకు వచ్చి వరండాలోకి చూసేసరికి గుండె లదిరిపోయాయి. రాజా వరండా వెనకాల వున్న సన్నజాజి పందిరి క్రింద కూర్చుని వున్నాడు. వాడి చేతిలో పొడుగాటి నల్లటి త్రాచుపాము. నవ్వుతూ దానితో ఆడుకుంటున్నాడు. అది చూడగానే నాకు భయం వేసింది. నోట మాట రాలేదు. ఇంతలో తేరుకుని గబగబా వెళ్ళి అమ్మను, రాధను పిల్చుకువచ్చాను. వాళ్ళుమాత్రం ఏంచేస్తారు? చూస్తూ నుంచున్నారు. రాధ, వాళ్ళన్నయ్యను కేకేస్తానని పరుగెత్తుకు వెళ్ళింది. అప్పుడేం గమ్మత్తు జరిగిందో తెలుసా?" చక్రాల్లాంటి కళ్ళను త్రిప్పుతూ చెబుతున్నది వసంత.

"నే చెబుతానుండవే వసంతా - అప్పుడు నాకూ ఏంచేయాలో తెలీలేదురా. నల్లటి నాగుపాము - పడగ కూడా విప్పింది. మనవాడు దాన్ని పట్టుకుని నవ్వుతూ వున్నాడు. వెంటనే దణ్ణంపెట్టుకుని - 'సుబ్రమణ్యస్వామీ నా పిల్లవాడ్ని నువ్వే కాపాడు. నీ పుట్టలో పాలు పోశాకనే వాడు పుట్టాడు. అందులోనూ నాగులచవితినాడు పుట్టాడు కనకనే

నాగరాజు అని పేరు కూడా పెట్టాము. నువ్వేవాడిని రక్షించాలి స్వామీ' అని మళ్ళీ నమస్కారం చేశాను. నా ప్రార్థన ఆలకించి, సుబ్రమణ్యస్వామి, మన రాజా చేతిలోనుంచి దిగి, మెల్లగా సన్నజాజి గుబురులోకి వెళ్ళిపోయాడు''- యింకా చెబుతున్న జానకమ్మ మాటలకు అడ్డువచ్చింది వసంత.

''ఆ రోజు సాయంత్రం నాన్న రాగానే అమ్మ నాన్నకి అంతా చెప్పింది. ఆ రోజే నాన్న సుబ్రమణ్యస్వామి ఆలయంలో పెద్ద పూజా అదీ చేయించి చలిమిడి పంచిపెట్టించాడు. పుట్టలో ఆవుపాలు పోసి అర్చన చేయించిందాకా నాన్నకీ, అమ్మకీ తృప్తి తీరలేదు! ఆ గుళ్ళో ఆచారిగారు ఆ నాగరాజే స్వయంగా మన నాగరాజుని ఆశీర్వచించాడనీ, మన రాజుకి గొప్ప యోగం వుందనీ, ఆ రాజయోగాన్ని యిక ఎవ్వరూ ఆపలేరనీ చెప్పాడు!''

అంతా విని గాఢంగా నిట్టూర్చాడు శ్రీరాం.

''ఎంత గండం తప్పింది!'' అన్నాడు రాజాను దగ్గరకు తీసుకుని, గట్టిగా ముద్దు పెట్టుకుంటూ.

''ఇది జరిగి మూడు రోజులయిందిరా'' అన్నాడు రాఘవయ్య, లంకపొగాకు చుట్ట చుడుతూ.

''మరి ఆ సన్నజాజి పొదలో వెతికారా? ఆ పాము, బహుశా యింకా అక్కడే వుందేమో. దాన్ని పట్టుకుని, చంపకపోతే మళ్ళీ బయటకు వచ్చి ఎవడ్నో ఒకడ్ని కాటేస్తుంది!'' అన్నాడు శ్రీరాం.

జానకమ్మ చెంపలు వాయించుకుంది. ''అలాటి అపచారం మాటలు అనకు. సాక్షాత్తూ ఆ సుబ్రమణ్యేశ్వరుడే ఆ పాము. అది మామూలు పామే అయితే మనవాడిని ఆ రోజే కరిచేది. నల్లత్రాచుని చంపితే కళ్ళు పోతాయి. దైవాంశగల పాములు అవి! వాటి మీద భక్తిగా వుండి నమస్కారం చేస్తే అవి మన జోలికి రావు''.

ప్రక్కనేవున్న పాలేరు అప్పన్న అన్నాడు - ''అది నిజమే బాబూ - మా యింటికాడ సత్తిగాడు అలాగే నల్లతాచుని చంపిన వెంటనే ఆడి రెండు కళ్ళూ పోయాయి. మా గూడెంలో వాళ్ళంతా ఆ పాము శవాన్ని ఊరేగించి, మంత్రాలతో దహనం చేశాం బాబూ - అప్పుడుగానీ సత్తిగాడి పాపం పరిష్కారం కాలే!''

''అంటే అప్పుడు పాపం పరిష్కారం అయిపోయి వాడికి కళ్ళు వచ్చాయా?'' అడిగాడు శ్రీరాం.

పాలేరు అన్నాడు - ''పోయిన కళ్ళు మళ్ళీ రాలేదు బాబూ - కానీ పాపం పరిష్కారమయి పోయింది''.

''అది సరేకానీ మధ్యాహ్నం ఖాళీగా వున్నప్పు డొకసారి యిలారా - ఆ సన్నజాజి పందిరి క్రింద లోతుగా గోతులు వున్నాయి. ఆ పాము అక్కడే వుంటున్నదేమోనని నా అనుమానం. అది తవ్వి చూద్దాం. అలాటి విషకీటకాలను, పిల్లలు తిరిగే యింట్లో వుంచటం చాలా ప్రమాదం!''

''ఆ పామును మాత్రం ఏం చేయకురా నాయనా. అది మామూలు పాము కాదని

చెబుతున్నానా? ఆ పడగా అదీ - తల మీద మణి, దైవాంశవున్న పాముది...'' యింకా ఏదో చెబుతున్నది జానకమ్మ.

''అమ్మా పాముల గురించి నాకు బాగా తెలుసు. మద్రాస్ యూనివర్సిటీలో నేను చేస్తున్న రిసెర్చి పాముల గురించే - అడయార్‌లోని స్నేక్ పార్క్ డైరెక్టర్ రోములస్ విటేకర్ సహాయం కూడా నాకు వుంది. పాములు దైవాంశ కలవీ కాదూ - యింకేమీ కాదు. పాము పడగ మీద మణులు వుండటం అబద్ధం అన్నది నిరూపింపబడిన నగ్నసత్యం. అంతే కాదు సినిమాల్లో చూపించినట్టు విషం కక్కిన పాములు నమస్కారం పెట్టగానే విషం మళ్ళీ వెనక్కి లాగేసుకోవటం అన్నది ఎక్కడా జరగదు - ఇంతవరకూ ఏ పాము అలా చేయలేదు. అలాగే నీ సుబ్రమణ్యస్వామి కోసం పుట్టలోపోసిన పాలు మట్టిలో యింకిపోతాయే కానీ, పాము తాగదు. సర్పయాగం చేసినంత మాత్రాన పిల్లలు పుట్టరు. ఇవన్నీ పరమ మూఢ నమ్మకాలు''.

''చదవేస్తే వున్నమతి పోయిందట. వీడిని రిసెర్చికి పంపించవద్దంటే విన్నారు కారు మీరు. ఇప్పుడు చూడండి భయం భక్తీ లేకుండా ఎలా మాట్లాడుతున్నాడో'' - జానకమ్మ రాఘవయ్యతో నిష్ఠూరంగా అన్నది.

''మీరేమయినా అనండి. మీ మూఢనమ్మకాలతో అలాటి విషకీటకాలను యింట్లో వుంచటం మంచిది కాదు. సాయంత్రంలోగా ఆ పందిరి క్రింద తవ్వదలుచుకున్నాను. పాము కనపడిందో చంపటమో, పట్టుకుపోవటమో చేస్తాను - లేదా - పాము లేదని రూఢి చేసుకుని, ఆ గుంటలు పూడ్చివేస్తాను'' అంటూ లోపలికి వెళ్ళిపోయాడు శ్రీరాం.

అప్పటిదాకా ఈ కథ చదివిన రమేష్ నిట్టూర్చి తల ఎత్తాడు.

''ఓ.కె. సూర్యం - ఈ కథ యిక్కడిదాకా బాగానే వ్రాశావ్. మరి దీన్నెలా ముగిద్దామనుకుంటున్నావ్?''

కిటికీ దగ్గర రెండు జేబుల్లోను చేతులు పెట్టుకుని నుంచున్న సూర్యం వెనక్కి తిరిగాడు.

''రమేష్ నువ్వు కూడా రచయితవే - నువ్వు చెప్పు ఈ కథను ఎలా ముగించ వచ్చో!''

రమేష్ - ఒక క్షణం ఆలోచించి అన్నాడు - ''సూర్యం యిలాటి కథలను ఏ రచయిత అయినా యిక్కడిదాకి సులభంగా వ్రాసుకుపోతాడు. కానీ యిలాటి కథలకు రచయిత యిచ్చే ముగింపు సమాజం మీద అంతో యింతో ప్రభావాన్ని కలుగచేస్తుంది. ఎంత వినోదంగా వ్రాసినా, ఉబుసుపోకకు వ్రాసినా, విజ్ఞానం కోసం వ్రాసినా, రచయిత సమాజానికి న్యాయం కానీ, అన్యాయం కానీ కదల ముగింపుల్లోనే చేస్తాడు. ఈ కథనే తీసుకుందాం. రచయిత మూఢనమ్మకాల పుట్ట అనుకుందాం. అలాటివాడు ఈ కథను ఎలా ముగింపు చేస్తాడు? ఈ కథను మూడు రకాలుగా ఆ మూఢ రచయిత ముగించటానికి అవకాశం వుంది. ఒకటి - శ్రీరాంకి పాము దొరకలేదు. 'అలాటి పాపానికి ఒడికట్టిన శ్రీరాంకి, దైవాంశగల పాము ఎలా కనపడుతుంది' అన్నది జానకమ్మ. తర్వాత రాజు పెద్దవాడై

ఐ.ఎ.ఎస్. పరీక్ష పాసయ్యాడు. కలెక్టరయాడు. 'మంచి యోగం వుంది రాజుకి' అన్న మాట నిరూపించాడు. ఇది ఒక ముగింపు లేదా - శ్రీరాంకి పాము దొరికింది, కర్రతో బాది చంపేశాడు. శ్రీరాంకి కళ్ళు పోయాయి. పాలివాడు చెప్పినప్పుడు ఎగతాళి చేసిన శ్రీరాం తర్వాత పశ్చాత్తాప పడ్డాడు. సుబ్రమణ్యస్వామికి దణ్ణం పెట్టుకుని భోరుమని ఏడ్చాడు. ఇది యింకో ముగింపు.

-- యిక మూడో ముగింపు. అక్కడ తవ్వేటప్పుడే పాము బుసలుకొడుతూ పైకిలేచి శ్రీరాంనే కాటు వేసింది. అలా అతని పాపానికి ప్రాయశ్చిత్తం అయింది".

"అవును రమేష్ రచయిత యిలా వ్రాస్తే సమాజం ముందుకు పోకపోగా, రోజురోజుకీ వెనకపడటమే కాకుండా, యింకా వెనక్కి వెడుతూవుంటుంది! కాని అసలు జరిగినకథ ఏమిటో తెలుసా నీకు".

"ఏమిటి ఈ కథ నిజంగా జరిగిందా?" అడిగాడు రమేష్.

సూర్యం ఒక్క క్షణం ఆగి చెప్పటం ప్రారంభించాడు. "అవును రమేష్! ఈ కథ నిజంగా జరిగిందే - కథలాగానే చెబుతాను విను - ఆ రోజు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత - పందిరి దగ్గర తవ్వుదామని శ్రీరాం నిశ్చయించుకున్నాడు. స్నానంచేసి ముందుగదిలో తల దువ్వుకుంటున్న శ్రీరాంకి పెరట్లో నుంచి పెద్ద గావుకేక వినపడింది. చకచకా పెరట్లోకి వచ్చిన శ్రీరాం ఆ దృశ్యం చూసి, నిర్ఘాంతపోయాడు. నోట మాటరాలేదు. సన్నజాజి పందిరి దగ్గర ఆడుకుంటున్న మూడేళ్ళ ముద్దులరాజు క్రిందపడి వున్నాడు. గిలగిలా కొట్టుకుంటున్నాడు - కొంచెం దూరంగా సరసర పాకుతూ వెడుతున్న పొడుగాటి నల్లత్రాచుపాము కూడా కనపడింది. అన్నిటికన్నా శ్రీరాం దృష్టి నాకర్షించింది - ఆ పాముకి భక్తితో నమస్కారం చేస్తూ స్థాణువులానుంచున్న జానికమ్మ!

ఆమె ప్రక్కనే చేతిలో కర్రవున్నా, పాముమీద దెబ్బవేయటానికి భయపడి నుంచున్న పాలేరు అప్పన్న - తర్వాత వాళ్ళు చెప్పినదాన్నిబట్టి తెలిసిందేమిటంటే - రాజా అక్కడ ఆడుకుంటున్నప్పుడు, వాడిదగ్గరకు పాము రావటం వాళ్ళు చూస్తూనేవున్నారు. రాజాని దూరంగా తీసుకుపోలేదు సరికదా, కనీసం పాము మీద ఒక దెబ్బ కూడా వేయలేదు వాళ్ళు. పైగా 'నాగరాజస్వామీ, సుబ్రమణ్యస్వామీ' అంటూ నమస్కారాలు పెడుతూ నుంచున్నారు ఆ మూఢులు, అమాయకుడైన పసిపిల్లవాడి ప్రాణాలుతీసిన హంతకులు. వాళ్లు మనుషులుకాదు - రాక్షసులు - సూపస్టిషస్ బార్బేరియన్స్-" సూర్యం కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"సూర్యం ఎందుకలా ఆవేశపడతావ్ - కామ్‌గావుండు - చెప్పు - అసలిది ఎక్కడ జరిగింది?" రమేష్ సూర్యం భుజం మీద చేయి వేస్తూ అడిగాడు.

"ఎక్కడోకాదు - మా యింట్లోనే జరిగింది. ఆ కథలో శ్రీరాం ఎవరో కాదు రమేష్, నేనే - నేనే - ఆ కథలో రాజా ఎవరో తెలుసా? నా ముద్దుల అందాల రాజా - నేను అమితంగా ప్రేమించిన నా తమ్ముడు. మూడేళ్ళ అమాయకపు పసివాడు. వాళ్ళ మూఢనమ్మకాలకి అన్యాయంగా ఆహుతి అయిపోయాడు రాజా - అదే రమేష్ వాడికి పట్టిన యోగం. రాజయోగం-" చేతుల్లో ముఖం దాచుకున్నాడు సూర్యం.

*